క్లుప్తంగా

పట్టాపాసుపుస్తకాల జారీకి దరఖాస్తుల స్వీకరణ

దామరగిద్ద: ఏళ్లుగా సాగులో ఉన్న అసైన్డ్ సర్వే నంబర్ 161లో సాగులో ఉన్న రైతులకు పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి చొరవతో, కలెక్టర్ ఆదేశాలతో బుధవారం తహసీల్దార్ ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించారు. మొదటి విడతగా 80మంది రైతులు మీ సేవా ద్వారా దరఖాస్తు చేశారని తహసీల్దార్ ప్రమీల తెలిపారు.

బాధితులకు చెక్కు అందజేత



మరికల్: మండలంలోని పెద్దచింతకుంటకి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు శ్రీశైలం గతేడాది నవంబర్‌లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. పార్టీ బీమా కింద వచ్చిన రూ.2 లక్షల చెక్కును మృతుడి భార్య మణెమ్మకు బుధవారం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. క్రియాశీలక సభ్యత్వం తప్పకుండా ప్రతిఒక్కరూ తీసుకోవాలన్నారు. ఏదైన ప్రమాదం జరిగినా.. తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ, కృష్ణారెడ్డి, రాజేందర్‌గౌడ్, రాజవర్ధన్ రెడ్డి, మల్లేష్, తిరుపతయ్య, లక్ష్మయ్య, హనిమ్రెడ్డి, నర్సిములు, అశోక్ పాల్గొన్నారు.

జాతర మహోత్సవం వాల్‌పోస్టర్ విడుదల



మాగనూర్: మండల పరిధిలోని నేరడగంలోని పశ్చిమాద్రి సంస్థాన విరక్తమఠం జాతర మహోత్సవం వాల్‌పోస్టర్‌ను పంచమ సిద్ధలింగ మహాస్వాములు ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జాతర మహోత్సవం ఉంటుందన్నారు. 9న సాయంత్రం 6 గంటలకు ప్రభోత్సవం, ఆధ్యాత్మిక ప్రవచనం, 10న సాయంత్రం 6 గంటలకు శ్రీ సిద్ధలింగ స్వాముల వారి మహారథోత్సవం, 7 గంటలకు ధార్మిక ప్రవచనం, తులాభార కార్యక్రమం, 11న ఉదయం 9 గంటలకు నామకరణ మహోత్సవం, పల్లకీసేవ కార్యక్రమాలు ఉంటాయని స్వామిజీ తెలిపారు. జాతర మహోత్సవానికి ప్రముఖులు హాజరవుతున్నారని, భక్తులు, మండల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జాతరమహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి భూమిపూజ



ధన్వాడ: మండల కేంద్రంలో నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం కోసం బుధవారం ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు భూమిపూజ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి పక్కన నూతన భవన నిర్మాణం కోసం అధికారులు ఎకరా 20గుంటల భూమిని ప్రభుత్వం కేటాయించింది. నూతన భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి మండల ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఎస్పీ తెలిపారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఐ రమేష్, డీఈఈ బాలజిదాస్, ఏఈ సాయికిరణ్, భీంరాజ్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రాజావళి ఉర్సు

అమరచింత: పట్టణ కేంద్రంలో వెలసిన సయ్యద్‌షా రాజావళి దర్గా ఉర్సు ఈనెల 10 నుంచి ప్రారంభం అవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉర్సు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్గా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. దర్గా పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు విద్యుత్ కాంతులతో అందంగా అలంకరించారు. ఎంతో మహిమానిత్వం గల రాజావళి దర్గాను సందర్శించుకొని మొక్కులు చెల్లించుకోవడానికి ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. కుల, మతాలకు అతీతంగా మతసామరస్యం చాటే వేడుకల్లో రాజావళి ఉర్సు ఎంతో గొప్పది.

దర్గా కమిటీ ఆధ్వర్యంలో..

మార్చి 10న గంధోత్సవంతో ఉర్సు ప్రారంభం అవుతుందని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. 11న తాజీ చిరాక్, 12 ఖత్మే ఖురాన్‌తో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. చివరి రోజు అన్నదాన కార్య క్రమం అలిండియా కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఖాదర్‌గోరి ఆధ్వర్యంలో కొనసాగుతుందని వారు తెలిపారు.



మహిళా చైతన్యంతోనే సమాజాభివృద్ధి

నారాయణపేట రూరల్: ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా మహిళలు అభివృద్ధి చెందితేనే సమాజం ముందుకు వెళ్తుందని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో మహిళ ప్రజాప్రతినిధులను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, కౌన్సిలర్లు అనిత, శిరీష, నారాయణమ్మ, గందె చంద్రకాంత్, సరాఫ్‌నాగరాజు, కన్నజగదీష్, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

- బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మిశ్యాం సుందర్‌గౌడ్ ఆధ్వర్యంలో మహిళా ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సత్కరించారు.
- బాలకేంద్రంలో విధులు నిర్వహిస్తున్న జ్ఞానామృత, పీఈటీ పారిజాతకు అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. కార్యక్రమంలో సెక్రెటరీ రమణ, సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.
- పట్టణంలోని కృష్ణగోకులం, శ్రీహంసవాహిని, ప్రభుత్వ గ్రౌండ్ పాఠశాలల్లో మహిళా టీచర్లను ఘనంగా సత్కరించారు. విద్యార్థినీలతో కలిసి కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేకతను తెలియజేశారు.
- ఆర్టీసీ డిపోలో మహిళా ఉద్యోగులతో డీఎం ఆంజనేయులు కార్యక్రమం చేపట్టారు. వారికి వివిధ రకాలైన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అంతకు ముందు కేక్ కట్ చేసి బతుకమ్మలు ఆడుకున్నారు. కార్యాలయ సిబ్బంది, ఏడీసీలు పాల్గొన్నారు.

మక్తల్‌లో మహిళలకు ఘన సన్మానం

మక్తల్: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం మక్తల్ పట్టణంలో వివిధ రంగాల్లో పని చేస్తున్న పోలీస్ శాఖల్లో పనిచేస్తున్న మహిళలకు మక్తల్ సీఐ సీతయ్య చేతుల మీదుగా సన్మానం చేశారు. టాగ్‌ఆఫ్‌వార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తాన్‌సింగ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం, దయానంద్ విద్యామందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, వైస్ చైర్మన్ అఖిలరెడ్డి, కౌన్సిలర్లను సన్మానించారు. మహిళ ఉపాధ్యాయులను ఘనంగా పూలమాల శాలువాలతో సన్మానించారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, మహిళ అధ్యక్షురాళ్లను, పోలీస్ శాఖ సన్మానం చేశారు. కార్యక్రమంలో మక్తల్ ఎస్ఐ పర్వతాలు, నరేందర్, విజయభాస్కర్, కర్నిస్వామి తదితరులు పాల్గొన్నారు.



నారాయణపేటలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చైర్మన్, కౌన్సిలర్లకు సన్మానం

అన్ని రంగాల్లో రాణించాలి

నారాయణపేట టౌన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ముఖ్యంగా ఆడవారిపై వివక్ష చూపకుండా ఆడ వారిని మగవారితో సమానంగా సమాజంలో మహిళలను గౌరవించాలని ప్రముఖ వైద్యులు గీత విశ్వనాథ్ అన్నారు. బుధవారం జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్, రెడ్డి సేవా సమితి, ఎస్పీ బాలు అభిమాన సంఘం ఆధ్వర్యంలో సివిల్‌లైన్‌లో డాక్టర్ గీత విశ్వనాథ్‌ను శాలువా జ్ఞాపికతో సత్కరించారు, కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు సుదర్శన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఆత్మారాం ఎడ్కె, అయ్యప్ప సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కాకర్ల భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

మరికల్: భవిష్యత్‌లో మహిళలు రాజకీయాల్లో రాణించేందుకు కృషి చేయాలని జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ అన్నారు. అంర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ఆమె పంచాయతీ సిబ్బంది, ఆశ కార్యకర్తలను సన్మానించి వారి సేవలను అభినందించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను తిప్పి కొట్టాలంటే అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలని సూచించారు. అలాగే శ్రీవాణి పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్, ఉపసర్పంచ్ వసుంధర, రాజవర్ధన్‌రెడ్డి, సాయిరెడ్డి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

ఊట్కూరు: మండల కేంద్రం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకేపీ భవనంలో మహిళా సంఘం సభ్యులను, అంగన్‌వాడీ టీచర్లను సన్మానించారు. బిజ్వార్‌లో మహిళలతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డా. జనార్దన్‌రెడ్డి, సర్పంచ్‌లు సూర్యప్రకాష్‌రెడ్డి, సావిత్రమ్మ, ఎంపీటీసీ హనుమంతు, వార్డు సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, వసంత్‌కుమార్, అనిల్ పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని పలు ప్రజాప్రతినిధులు మహిళలను శాలువా పూలమాలలతో సన్మానించారు. తహసీల్దార్ నాగలక్ష్మి, ఉపతహసీల్దార్ గాయత్రితో పాటు మహిళ సిబ్బందిని మత్స్య సహకర సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు నీరటి నర్సింహులు నాయుడు పూలమాల శాలువాలతో సన్మానించారు. అలాగే చర్లపల్లిలో సర్పంచ్ రాములు గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామాల్లో పనిచేస్తున్న మహిళలను శాలువా పూలమాలతో సన్మానించారు.

మద్దూరు: మండల పరిషత్ కార్యాలయంలో, ఆపరేషన్ మోర్సీ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ విజయలక్ష్మి, వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలను సన్మానించారు. ఆపరేషన్ మొర్సీ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళ అభివృద్ధి సెంటర్‌లో ఎంపీపీ, సర్పంచ్ అరుణ కలిసి కేక్ కట్ చేశారు. మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటయ్య, ఎంపీఓ ఉదయ్‌శంకర్, ఫౌండేషన్ సభ్యులు పద్మ, రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేద్కర్ చౌరస్తా నుంచి సత్యనారాయణ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయలక్ష్మి, జిల్లా కార్యదర్శి సౌజన్య మాట్లాడారు. 1910 మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినంగా ఆవిర్భావం జరిగి 112 ఏళ్లు అయిందన్నారు. ఇప్పటికీ మహిళలపై లైంగిక వేధింపులు వివక్షలు అధికమవుతున్నాయని అన్నారు. మహిళ హక్కుల కోసం ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా మహిళలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పీఓడబ్ల్యూ మహిళ సంఘం జిల్లా నాయకురాలు విజయ, సరళ, రాధిక, అనిత, లక్ష్మి, మాధవి, గజలమ్మ, మంజుల, కాశీనాథ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

దామరగిద్ద: జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నగరేశ్వర ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళ సాధికారతకు ప్రతిఒక్కరూ నడుంబిగించాలని, పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరారు. మాజీ జెడ్పీటీసీ వెంకటమ్మ, మాజీ ఎంపీపీ సువర్ణమ్మ, మహిళలు పాల్గొన్నారు.



దామరగిద్దలో కేక్ కట్ చేస్తున్న మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీలు



మక్తల్‌లో పోలీస్ సిబ్బందిని సన్మానిస్తున్న సీఐ సీతయ్య



నారాయణపేటలో గీత విశ్వనాథ్‌ను సన్మానించి జ్ఞాపిక అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో ర్యాలీ



చర్లపల్లిలో ఉద్యోగులను సన్మానిస్తున్న సర్పంచ్ రాములు



మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో..




మరికల్‌లో పంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న సురేఖ



బిజ్వార్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

వీధులన్నీ చీకటిమయం



జిల్లా కేంద్రంలో వీధి లైట్లు లేని కారణంగా చీకటి మయంగా ఎర్రగుట్ట రహదారి

- వెలగని వీధి దీపాలతో స్థానికుల అవస్థలు
- దృష్టిసారించని అధికారులు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో ఎర్రగుట్ట, యాద్గీర్ రోడ్, శివారు కాలనీల్లో వీధి లైట్లు ఏర్పాటు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యాద్గీర్ రోడ్‌లోని ఎర్రగుట్ట నుంచి అయ్యప్ప స్వామి దేవాలయం వరకు కరెంట్ స్తంభాలు ఉన్నప్పటికీ వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్లపై ఎక్కడ గుంతలు ఉన్నయో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయానికి, అక్కడే ఉన్న గురుకుల పాఠశాలకు, లోకయపల్లి లక్ష్మమ్మ అలయ పరిసరాల్లో సాయంత్రం ఆరు దాటితే బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు.

ఎందుకు ఏర్పాటు చేయరూ..

కరెంట్ స్తంభాలు ఉన్నా.. కూడా ఎందుకు వీధి దీపాలు ఏర్పాటు చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారిలో వీధి దీపాలు అమర్చకపోవడం కారణంగా రాత్రి వేళ ఇళ్లకు చేరుకునే మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారు. యాద్గీర్ రోడ్, సివిల్‌లైన్, పాతగంజ్ రోడ్, ఎర్రగుట్ట రోడ్‌లో వీధి లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళ వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు వీధి లైట్లు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

గుంతలు కనిపించడం లేదు..



సివిల్‌లైన్‌లో లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రివేళ రోడ్లపై ఉన్న గుంతలు కనిపించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని వీధి లైట్లు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలి.

– నగేష్, నారాయణపేట

మాదాసీ కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతి అందజేస్తున్న మాదాసీ మాదారి కురువ సంఘం నాయకులు

మాగనూర్: మాదాసి కురువలకు ఎస్సీ కులధ్రువీకరణ పత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుధవారం మాగనూర్ మండల కేంద్రంలోని శ్రీ బీరలింగేశ్వర ఆలయం నుంచి మాదాసీ మాదారి కురువాలు తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలో పాల్గొని మాగనూర్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా మాదాసీ కురువ, మాదారి కురువ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్ మాట్లాడారు.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఇచ్చిన హక్కులు సాధించుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధమన్నారు. అదే విధంగా కురువ బీసీ అని తప్పుడు కులధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన మెమో నం 1268 ప్రకారం.. మాదాసీ కురువ, మాదారి కురువ ఎస్సీ కులధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మా పూర్వీకుల నిరక్షరాస్యతతో పాటు అధికారుల నిర్లక్ష్యం కారణంగా మా కులానికి కురువ-బీసీ బి-11 అని తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మా న్యాయపరమైన డిమాండ్ పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప, కురువ సంఘం నాయకులు యుగేందర్, అశోక్‌కుమార్, నాగరాజు, వెంకటయ్య, లింగం, మహాలింగప్ప, ఆశప్ప, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మక్తల్ అభివృద్ధి కనిపించడం లేదా?

నర్వ: మక్తల్ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే చిట్టెం చేస్తున్న అభివృద్ధి కనిపించడంలేదా అని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఒకసారి వీజేఆర్ ఫౌండేషన్ అంటూ.. మరొకసారి బీఆర్‌ఎస్ అంటూ ప్రజల్లో తిరుగుతూ గందరగోళం సృష్టిస్తూ.. వ్యతిరేకంగా మాట్లాడటం ఎంతవరకు సమంజసమన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అని చెప్పుకొనే నీవు ఏనాడు మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలను కలుపుకొని కార్యక్రమాల్లో పాల్గొన్నావో చెప్పాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్, జిల్లా మంత్రుల సహకారంతో మక్తల్‌ను అభివృద్ధి చేస్తుంటే కళ్లులేని కబోదిలా మాట్లాడం ఎంత వరకు సమంజసమన్నారు. ఎంపీపీ జయరాములుశెట్టి, గౌనిజ్యోతి, లక్ష్మీకాంత్‌రెడ్డి, కిరణ్‌ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తవ్వకాలు నిలిపివేయండి

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి గుట్ట వెనక భాగంలో అక్రమంగా తవ్వుతున్న క్వారీ పనులను వెంటనే నిలిపివేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం తవ్వకాల క్వారీ వద్ద రైతులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, భగవంతు, పాండు తదితరులు ఉన్నారు.

రోడ్లపై రాళ్లు తొలగించండి



జిల్లా కేంద్రంలోని యాద్గీర్ రోడ్‌లో పగలగొట్టిన బండరాళ్లు

నారాయణపేట టౌన్: హోలీ పండుగలో భాగంగా జిల్లా కేంద్రంలో కొందరు అల్లరి మూకలు రోడ్లపై బండ రాళ్లు పగలగొట్టారు. దీంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి యాద్గీర్ రోడ్, వార్డులోని అశోక్‌నగర్, సాయివిజయ్ కాలనీ, సివిల్‌లైన్ రోడ్, పళ్ల కాలనీల్లో బండరాళ్లు పగలగొట్టడంతో రాత్రి వేళ అవి కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వెంటనే సంబంధిత అధికారులు దృష్టిసారించి రోడ్లపై ఉన్న బండరాళ్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

లింగ సమానత్వం ఎంతో అవసరం



టీచర్లను అభినందిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

నారాయణపేట రూరల్: సమాజంలో లింగ సమానత్వం ఎంతో అవసరమని జెడ్పీ సీఈఓ జ్యోతి అన్నారు. నారాయణపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం పీఆర్‌టీయూ మహిళా టీచర్లు నిర్వహించిన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవానికి డీఈఓ లియాకత్ అలీ, జీసీడీఓ పద్మనళినితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు పక్కా ప్రణాళికతో పాటు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు పోవాలని సూచించారు. మహిళలు చైతన్యవంతమై బాలకార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలను అడ్డుకోవాలన్నారు. అంతకు ముందు వివిధ క్రీడాపోటీల విజేతలకు బహుమతులు అందించి, శాలువా, మెమెంటో అందించి సత్కరించా రు. పీఆర్‌టీయూ నాయకులు జనార్దన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వరలక్ష్మి, వాణిశ్రీ, శశికళ, అన్నపూర్ణ, మాధ వి, రాధిక, భీమేశ్వరి, స్నేహలత, సునీత, రఘువీర్, మొల్గాన్‌జనార్దన్, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

మక్తల్: ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన మక్తల్ పట్టణంలో నారాయణపేట క్రాస్ రోడ్డు వద్ద బుధవారం చోటుచేసుకుంది. మక్తల్ మండలం టెకులపల్లికి చెందిన శ్రీనివాస్(34) తన భార్యను ఉప్పర్‌పల్లిలో వదిలి వెళ్తున్నాడు. తిరుగు ప్రయాణంలో మరొక ద్విచక్రవాహనం రోడ్డు మలుపులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించారు.